ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (భీమవరంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 14-12-95)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రమణమహర్షిగారు చెప్పినది హృదయవిద్య. శాస్త్ర చర్చలతో సంబంధములేకుండా సూటిగా హృదయంలోనికి పంపించటంకోసం వచ్చిన అవతారం ఆయన. అనవసరమైన శాస్త్ర చర్చలకు, వాదోపవాదములకు వెళ్లకుండా సూటిగా జీవుడిని హృదయ గుహలోనికి పంపటానికి భగవాన్ ఎక్కువగా ప్రయత్నం చేసారు. నీ హృదయంలోనే చైతన్యం ఉంది. నీ హృదయమే నీ స్వరూపము. స్వరూపం శక్తిలేకుండా లేదు. స్వరూపం జ్ఞానం లేకుండా లేదు. నీ స్వరూపంలోనే జ్ఞానం ఉంది, ఆనందము ఉంది. అందుచేత నీవు ఎవరో నీవు తెలుసుకోవటం మంచిది. మానవుడికి వాడు ఎవడో వాడికి తెలియకపోవటం బంధము. వాడు ఎవడో వాడికి తెలిస్తే అది మోక్షము. బంధము నీకు బయట లేదు, నీలోపలే ఉంది.

భగవాన్ భక్తులలో కుంజుస్వామి ఒకరు. నేను ఎక్కడికి వెళ్ళినా శాస్త్రముల గురించి అడుగుతున్నారు, భగవాన్ ఏమిచెప్పారు అని అడుగుతున్నారు. నేను చెప్పలేకపోతున్నాను. అందుచేత భాషలు నేర్చుకోవాలని అనుకొంటున్నాను, శాస్త్రములు చదవాలనుకొంటున్నాను అని కుంజుస్వామి భగవాన్‌తో చెప్పారు. నీవు ఎన్ని భాషలు నేర్చుకొంటావు, ఎన్ని శాస్త్రములు చదువుతావు. ఇలా నీకు కొన్ని వేలజన్మలు వెళ్ళిపోతాయి. ముందు నీవు ఎవడివో నీవు తెలుసుకో. నీవు ఎవడివో నీవు తెలుసుకొన్నాక ఇంకా తెలుసుకోవలసిన విషయములు మిగిలిఉంటే అప్పుడు తెలుసుకోవచ్చును. ముందు నీవు ఎవడివో నీవు తెలుసుకో అని భగవాన్ కుంజుస్వామికి చెప్పారు. అందుచేత శాస్త్రములు చదవటంకాదు. నీవు ఎవడివో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నించు. నీవు ఎవడివో నీవు తెలుసుకొన్నాక నీద్వారా సమాజము ఉద్ధరించబడుతుంది. ముందు నీకు పవిత్రత కలిగితే సమాజంకూడా పవిత్రం అవుతుంది. సమాజం నీకు వేరుగాలేదు.

ఆలోచన అనేది ప్రారంభిస్తే నీ మేధస్సుకంటే అతీతమైన శక్తి ఒకటిఉంది అని నీకు తెలుస్తుంది. దీనికి కొంత సాధన ఉండాలి, మనోనిగ్రహం ఉండాలి, వినయం ఉండాలి. మేధస్సును ఉపయోగించి బాహ్యవిషయములను, ప్రకృతి విషయములను ఆలోచిస్తూ ఉంటే ప్రకృతి రహస్యాలు కొన్ని తెలుస్తాయి. ఈ మేధస్సును హృదయంలో నిలబెట్టి ఉంచితే ఆత్మ జ్ఞానము కలుగుతుంది.

అంతర్ముఖం, బాహ్యముఖం గురించి అడుగుతూ ఉంటారు. నీ మనస్సును దాని పుట్టు స్థానమైన హృదయంలో నిలబెట్టి ఉంచటమే అంతర్ముఖం. నీ మనస్సు కనుక హృదయంలో ఉంటే అది అంతర్ముఖం. నీ మనస్సు హృదయంలో ఉండకపోతే నువ్వు బాహ్యముఖంలో ఉన్నట్లే. విడిగా చెప్పనక్కరలేదు.

మన దుఃఖానికి కారణము మనస్సు, మన బంధానికి కారణము మనస్సు. పూర్వజన్మ వాసనలు మనస్సులో ఉన్నాయి. రాబోయే జన్మకు హేతువులు మనస్సులో ఉన్నాయి. మనస్సును విడిచిపెట్టి బంధములేదు, మనస్సును విడిచిపెట్టి అజ్ఞానములేదు. నీవు, నేను అనే బేధబుద్ధిని కల్పించేది కూడా మనస్సే. దేవుడిని కూడా మనస్సే కల్పించింది. అందుచేత మనస్సు ఉదయించటంవలన ఏవైతే వస్తున్నాయో మనస్సు అణిగిపోవటంవలన అవి

అన్నీ అణిగిపోతాయి.

ఇప్పుడు మనకు అసత్యమైన నేను వ్యక్తమవుతోంది. ఎక్కడైతే అసత్యమైన నేను దానికి సంబంధించిన రాగద్వేషములు, ప్రకృతి గుణాలు కాలి బూడిద అవుతాయో అక్కడనుండి సత్యమైన నేను ఉద్భవిస్తుంది అని భగవాన్ చెప్పారు. అసత్యమైన నేను శిరస్సులో అణగదు. అసత్యమైన నేను హృదయంలో అణుగుతుంది. అసత్యమైన నేను ఎక్కడయితే అణిగిపోయిందో అక్కడే సత్యమైన నేను నీకు వ్యక్తమవుతుంది. అసత్యమైన నేనుకు పరిమితులు ఉన్నాయి. అది దేశకాలములకు లోబడి ఉంటుంది. నిజమైన నేనుకు పరిమితులు లేవు. అది ఎప్పుడూ ఉంటుంది, ఏకంగా ఉంటుంది, నిదానంగా ఉంటుంది, శాంతంగా ఉంటుంది. నిజమైన నేను ఉపాధి రహితము. ఎప్పుడూ ఉండటమే దాని పని. నిజమైన నేను అంటే ఎవరో అనుకొంటున్నావేమో అది నీ స్వరూపమే. అది నీకు ఎప్పుడైతే వ్యక్తమయిందో అప్పుడు నీ హృదయంలో ఉన్న శాంతి సముద్రము, ఆనంద సముద్రము నీ సహస్రారమునకు అందుతుంది.

నీలోపల ఉన్న సద్వస్తువు పరమ పవిత్రమైనది, అది పూర్ణమైనది. అది ఎంత పవిత్రమైనదో నీవు కూడా అంత పవిత్రతను సాధిస్తే అది నీకు వ్యక్తమవుతుంది. నీలోపల ఉన్న సత్యవస్తువు సజీవముగా ఉంది. అది ఉందా, లేదా అనే అనుమానం అక్కరలేదు. బాహ్యంగా ఉన్న శత్రువులకంటే నీలోపల ఉన్న శత్రువులే నీకు ఎక్కువ అపకారం చేస్తారు. నీ రాగద్వేషములే ఎక్కువ అపకారం చేస్తాయి. అందువలన ముందు నీలోపల ఉన్న శత్రువులను తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి అని ప్రహ్లాదుడు చెప్పాడు. ప్రహ్లాదుడికి భక్తులలో అగ్రస్థానం ఇచ్చారు. ఆయనకున్న ఏకాగ్రత, పవిత్రత, పరమేశ్వరునిపట్ల ఆయనకున్న సజీవమైన విశ్వాసం అటువంటివి. నీ హృదయంలో ఉన్న పరమేశ్వరుని మీద నీకు సజీవమైన విశ్వాసం ఉంటే ఆయన నీకు వ్యక్తమవుతాడు. అనుమానం పనికిరాదు. మనం చేసే ప్రయత్నానికి ఇతరులు ఎవరూ అడ్డురారు. భగవంతుడు ఉన్నాడా, లేడా అనే అనుమానమే మనకు అడ్డువస్తూ ఉంటుంది. అందువలన అనుమానం పెట్టుకోవద్దు. నీ హృదయంలో పరమేశ్వరుడు ఉన్నాడు. నీకు ఉన్న అలవాట్లవలన, నీకు ఉన్న జీవ లక్షణములవలన నీ హృదయంలో ఉన్న పరమేశ్వరుడు నీకు తెలియటంలేదు. మేము సాధన చేస్తున్నాము అభివృద్ధి కనబడటంలేదు అని కొంతమంది చెపుతూఉంటారు. సాధన చేస్తున్నప్పటికీ అభివృద్ధి కనబడకపోతే ఆ మనిషికి వైరాగ్యంలేదు అని అర్థం. సాధకుడు, అభ్యాసము, వైరాగ్యములను విడిచిపెట్టరాదు అని భగవంతుడు గీతలో పదే పదే చెప్పాడు.

నీ దేహమును ప్రారబ్దమునకు విడిచిపెట్టు. నీవు వచ్చిన పని ఏదో అది చూసుకో అని భగవాన్ చెపుతూ ఉండేవారు. ప్రారబ్దమునుబట్టి దేహం వస్తుంది. ప్రారబ్దం లేకపోతే దేహమేరాదు. దేహం వచ్చింది అంటే ప్రారబ్దం ఉన్నట్లు గుర్తు. వారు దేవతా పురుషులు అవ్వవచ్చు, సామాన్య మానవులు అవ్వవచ్చును. సత్పురుషులు చేసిన పుణ్యం, దుష్టులు చేసిన పాపం ఇవి రెండూ కలిసి భగవంతుని దేహమునకు ప్రారబ్దం అవుతాయి అని పెద్దలు చెపుతారు. ఆ దేహమునకు కూడా ప్రారబ్దం ఉంటుంది. కృష్ణుడి దేహమునకు ప్రారబ్దం ఎలా ఉందో అలాగే మన దేహమునకు కూడా ప్రారబ్దం ఉంది. ప్రారబ్దంద్వారా మనం నేర్చుకోవలసిన పాఠాలు నేర్చుకొన్నాక ఆ దేహం పడిపోతుంది. దేహము పుట్టినపుడు నీవు పుట్టలేదు. అందుచేత దేహం మరణించినపుడు నీవు మరణించవు అని భగవాన్ చెప్పారు. నేను అనే ప్రథమ తలంపు పుట్టినప్పుడు నీవు పుట్టావు. అది ఎప్పుడియితే అణిగిపోయిందో అప్పుడు నీకు పునర్జన్మలు ఆగుతాయి అని భగవాన్ చెప్పారు.

మనస్సుకు దేహంకావాలి, లోకం కావాలి, దేవుడు కావాలి. కాని ఆత్మకు దేహంతో పనిలేదు, లోకంతో పనిలేదు, దేవుడితో పనిలేదు. అది ఉండటంవలననే అది తెలియబడుతుంది. అది ఉందని తెలియబడటానికి బాహ్యమైన సహకారం ఏమీ అక్కరలేదు. అది నీ ఇంద్రియాలకు, నీ మనస్సుకు అందకపోవచ్చును. నీ

అనుభవానికి అందుతుంది. రామకృష్ణ పరమహంస ఒకమాట చెప్పారు. నీటిలో ఉప్పును కలిపితే అది నీ కళ్ళకు కనబడదు. కాని నోటిలో వేసుకుంటే అది ఉప్పు నీరు అని తెలుస్తుంది. పరమేశ్వరుడు నీ కళ్ళకు కనబడక పోయినా అనుభవానికి వచ్చినప్పుడు ఉప్పునీరు నీ నాలుకకు ఎలా తెలుస్తోందో అలాగే నీ హృదయానికి పరమేశ్వరుడు తెలుస్తాడు. ఋజువులు, సాక్ష్యాలు అక్కరలేదు. ఆయన నీ అనుభవానికి అందుతాడు. నీకు మోక్షం కావాలంటే శరీరం మరణించేవరకూ ఆగనక్కరలేదు. మరణానికి, మోక్షానికి ఎట్టి సంబంధము లేదు. ప్రారబ్దం పూర్తి అయిన వెంటనే శరీరం మరణిస్తుంది. శరీరం ఈ భూమిమీద ఎక్కడ ఉండాలి, ఎన్ని సంవత్సరాలు ఉండాలో, ఏ పని చేయాలో అవి అన్నీ ఈ దేహము ద్వారా జరిగిపోతూ ఉంటాయి. దాని గురించి నీవు ఆలోచించవద్దు. నీవు వచ్చిన పని చూసుకో. నీవు ఎవడివో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నించు. నీవు ఎవడివో నీకు తెలిస్తే అదే మోక్షము.

శరీరం మరణించిన తరువాత ఏ నేనును అయితే నీవు వైకుంఠమునకు పంపుదామని అనుకొంటున్నావో, ఏ నేనుతో అయితే రావటాలు, పోవటాలు అనే పనులు చేద్దామని అనుకొంటున్నావో, ఏ నేనును అలంకరించాలనుకొంటున్నావో ఆ నేను నుండి విడుదల పొందటమే మోక్షము. అందరూ ఈ నేనుతో సాధనలు చేద్దామని ఉబలాట పడేవారే గాని సాధన చేస్తున్న ఈ నేను ఎవరు?అని ప్రశ్నించేవారు ఒక్కరూ కనబడటంలేదు అన్నారు భగవాన్.

మనం చేసే పనిలో భక్తి ఉండాలి. భక్తి అంటే మనకు పనికి రానిది కాదు. దైనందిన జీవితములో మనం ఏ పనిచేసినా అక్కడ భక్తి ఉండాలి. భక్తి ఉంటేనే ఆపనిని మనం బాగా చేయగలము. భక్తిని ప్రాక్టీసు చేస్తే మనం చేసే పనిలో Perfection వస్తుంది. ఎవడైతే నిరంతరము తన స్వరూపమైన ఆత్మను ధ్యానం చేస్తున్నాడో వాడే భక్తుడు. నీవు ఏ ఆత్మగా ఉన్నావో, ఏ చైతన్యంగా ఉన్నావో దానిని నిరంతరము ధ్యానం చేయటమే భక్తి అని ఆచార్యులవారు చెప్పారు. మనం వంట చేసుకోవటానికి కుండ, పొయ్యి, నిప్పు, పుల్లలు ఇలా సామగ్రి అంతా మనకు ఎలా అవసరమో అలాగే నీవు ఆత్మానుభవం పొందటానికి కావలసిన సామగ్రిలో భక్తి కూడా అవసరము అని ఆచార్యులవారు చెప్పారు.

కంసాలి వస్తువులను చూడడు. ఆ వస్తువులలో ఉన్న బంగారమును చూస్తాడు. అలాగే జ్ఞాని నామరూపములను చూడడు. అందరి హృదయములో ఉన్న ఆత్మను చూస్తాడు. ఒకరు రమణమహర్షిగార్ని అడిగారు. మీరు అలా శూన్యంలోనికి చూస్తున్నారు. ఎవరిని చూస్తున్నారు అని అడిగారు. ఎవరినైనా చూడటానికి నాకు భిన్నంగా ఏమి ఉంది. నన్ను నేనే చూసుకొంటున్నాను అన్నారు భగవాన్.

బయట ఉన్నవస్తువులతో మన మనస్సుకు ఉన్న సంబంధమును, బయట ఉన్న నామరూపములతో మన మనస్సుకు ఉన్న సంబంధమును, బయట ఉన్న వ్యవహారములతో మన మనస్సుకు ఉన్న సంబంధమును వృత్తి అంటారు. అహం వృత్తిలో వృత్తిపోతే చాలు. మన స్వరూపములో దుఃఖము లేదు అందుచేత మనం దుఃఖమును కోరుకోవటం లేదు. మన స్వరూపంలో మరణం లేదు అందుచేత మనం మరణం అంటే ఇష్టపడటం లేదు. ఎందుచేత మనం జ్ఞానమును కోరుకొంటున్నాము అంటే మన స్వరూపములో ఉన్నది జ్ఞానమే. మనకు తెలుసున్నా, తెలియకపోయినా మన స్వరూపములో ఏదైతే ఉందో దానినే మనం కోరుకొంటాము.

దేహము లోపల నేను ఉన్నానని, దేహము బయట ప్రపంచముఉందని, ఎక్కడో వైకుంఠములో దేవుడు ఉన్నాడు అని అనుకొంటున్నాము. ఇవి అన్నీ మనస్సుయొక్క కల్పితములు. ఆత్మకు లోపలలేదు. బయటలేదు. లోపల బయటమనస్సుకే. దేహబుద్ధి ఉన్నవాడికి లోపల, వెలుపల ఉంటాయి. ఆత్మబుద్ధి ఉన్నవాడికి లోపలలేదు, బయటలేదు.

నీకు ఏ మార్గము ఇష్టమైతే ఆ మార్గములో సాధన చెయ్యి. భక్తిమార్గము, కర్మమార్గము, ధ్యానమార్గము ఇలా నీకు ఏ మార్గము సుఖంగా ఉంటే ఆ మార్గములో ప్రయాణం చెయ్యి. కాని తెలుసుకోవలసింది ఏమిటి అంటే దేహగతమైన నేను నుండి విడుదల పొందటమే. అదే మోక్షము.

అత్యంత సులభం ఆత్మ విద్య అని భగవాన్ చెపుతూ ఉండేవారు. ఆత్మానుభవం సంపాదించటం అత్యంత సులభం అనేవారు. దానికి కారణం అది నీ స్వరూపమే. అది నీకు దూరానలేదు. ఆ వస్తువు నీలోపలే ఉంది. నీకోసం ఎదురుచూస్తోంది. రవ్వంత, ముల్లంత నీ మనస్సును లోపలకు త్రిప్పగలిగితే అది నీకు తెలుస్తుంది. అన్నం నోటికి అందించినట్లుగా నీ మనస్సును హృదయంలో ఉన్న పరమేశ్వరునికి అందియ్యి. వాడే నమిలి, తినేస్తాడు. వాడికి ఆహారం ఇదే.

దేవుని తెలుసుకోవాలి, ఆత్మను తెలుసుకోవాలి అని అంటున్నారు. మంచిదే. కాని దేవుని తెలుసుకోవాలి అనే ఈ నేను ఎవడు? అని మధ్య మధ్య ప్రశ్నించుకోండి అని భగవాన్ చెపుతున్నారు.

రమణమహర్షిగారు చెప్పినది Spiritual Science. ఆయన హేతువాదులకు హేతువాది. దేవుడు ఉన్నాడా, లేడా అని రమణమహర్షిగారిని అడిగారు. ఆయన చెప్పిన సమాధానంలో ఉన్న అందాలు చూడండి. ఇటువంటి సమాధానాలు ఏ ఉపనిషత్‌లలోనూ కనబడవు. ఈయన ఒక Scientific పద్ధతిలో చెప్పారు. ఇంత అందమైన సమాధానాలు, ఇంత పొట్టి సమాధానాలు మీకు ఎక్కడా కనబడవు. ఇక్కడ వేదాలు, ఉపనిషత్‌లు చదువుకొన్నవారు ఉండవచ్చు. పండితులు ఉండవచ్చు. ఈ సమాధానాలు ఎక్కడ ఉన్నాయో చూడండి. మనకు ఎదురుగుండా ఉన్న వస్తువు లోకువ. దూరపు కొండలు నునుపు. దేవుడు ఉన్నాడా, లేడా అని భగవాన్‌ను ప్రశ్నిస్తే భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు ఉన్నావా అని అడిగారు. నేను ఉన్నాను అన్నాడు. నువ్వు ఉంటే వాడు లేకుండా ఎక్కడికి పోతాడు అన్నారు భగవాన్. ఎంత అందంగా ఉందో చూడండి. దీనికి reference ఏమీ అక్కరలేదు. ఆయన అనుభవంలోనుండి తీసిఇవ్వటమే. నువ్వు ఉంటే లోకం ఉంది, నువ్వు ఉంటే దేవుడు ఉన్నాడు. నీవు మంచిచేస్తే మంచి, నీవు చెడ్డచేస్తే చెడ్డ నీకు ఫలితమును అందచేసేవాడే దేవుడు. వాడే ఈశ్వరుడు. ఈశ్వరుడు అంటే నియమించేవాడు.

ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్దమునను సరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును. జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు. అని భగవాన్ చెపుతూ ఉంటే అక్కడ ఉన్న ఒక ప్లీడరుగారు ప్రక్కనే ఉన్న టేబుల్ ఫ్యాన్ స్విచ్‌ను ఆఫ్‌చేసి ఈరోజున ఈ టైములో టేబుల్ ఫ్యాన్ స్విచ్ ఆపటం అనేది కూడా నా తల్లి గర్భంలో నుండి బయటకు వచ్చినప్పుడే నిర్ణయం అయిందా, ఇది కూడా ప్రారబ్దమేనా అని అడిగారు. పెళ్ళిళ్ళు, వృత్తి, ఇటువంటి పెద్ద సంఘటనలు ప్రారబ్దమునుబట్టి జరుగవచ్చును. ఫ్యాన్ ఆపటంలాంటి చిన్నచిన్న సంఘటనలు కూడా ప్రారబ్దమేనా అని అడిగారు. ఏమీ సంకోచము లేకుండా, ఏమీ అనుమానంలేకుండా ఇవి అన్నీ కూడ ప్రారబ్దమే. పెద్ద సంఘటనలు మాత్రమేకాదు ప్రతీ చిన్న సంఘటనకూడా దేహ ప్రారబ్దమే అన్నారు భగవాన్. ప్రతీదీ ప్రారబ్దము ప్రకారము జరిగితే ఇంక సాధన ఎందుకు అని అడిగారు. ప్రారబ్దము కేవలము దేహానికి మాత్రమే. నీవు ఎవడివో నీవు తెలుసుకోవటానికి అదేమీ అడ్డురాదు. అక్కడ భగవంతుడు నీకు స్వేచ్ఛ ఇచ్చాడు. బాహ్యంగా ఇద్దరు ఒకే కష్టంను అనుభవిస్తున్నారు అనుకోండి. ఒకరికి ఆ కష్టం కష్టంలాగా కనబడదు. ఇంకొకరికి ఆ కష్టం చాలా పెద్దదిగా కనబడుతుంది.

ఎందుచేతనంటే receive చేసుకొనే Stationలో తేడా. నీవు సాధనచేస్తూ ఉంటే, నీవు ఎవడివో నీకు తెలుస్తూ ఉంటే, హృదయాభిముఖంగా నీవు ప్రయాణం చేస్తూ ఉంటే నీ దేహము ప్రారబ్దమును అనుభవిస్తూ ఉంటుంది. ఆప్రభావము నీమీద పడదు. అది దేహమునకే సంబంధించినది అని నీకు తెలుస్తూ ఉంటుంది.

సంఘటన జరుగుతూ ఉంటుంది. దాని ప్రభావం కించెత్తుకూడా, ముల్లంతకూడా నీమీద పడదు. దానికి సంబంధించిన దుఃఖముకూడా నీమీద పడదు.

మనం చేసే సాధనలు అన్నీరెండవ పక్షము. గురువు అనుగ్రహము అత్యంత ముఖ్యమైనది. గురువుతో ఉన్న సంబంధము తెగదు. ఆయనమీద ప్రేమ కలిగేటట్లు ఆయనే చేసుకొంటాడు. ఒకోసారి గురువుమీద మనకు కోపం రావచ్చును. అయినా ఆయన కోపం తెచ్చుకోడు. గురువుమీద ఒకోసారి మనం react అవుతాము. అయినా ఆయన react అవ్వడు. చంటిపిల్లలను ముద్దుకోసం ఎత్తుకుంటాము. వాళ్లు కాళ్లతో మనలను తన్నుతారు, మల విసర్జన చేస్తారు, మూత్ర విసర్జన చేస్తారు. అయినా వాళ్లను క్రింద పారవేయము. వారిపట్ల ముద్దుగానే ఉంటాము. అదేవిధంగా నిజమైన గురువుతో ఒకసారి మనకు అనుబంధము కలిగితే మనం ఆయనమీద react అయినా, మానసికంగా ఒకోసారి మనం ఆయనకు దూరం అయినా, ఆయనమీద మనకు ఇష్టం లేకపోయినా, మనం ఆయనను విడిచిపెట్టినా ఆయన మనలను విడిచిపెట్టడు. ఆయన మీద ప్రేమ, ఆప్యాయత కలిగేటట్లు ఆయనే చేసుకొని ఆయన స్థితి మనకు అందేవరకూ ఆయన మనలను విడిచిపెట్టడు. వాడు గురువు. రమణమహర్షిగారు ఆత్మ నిజం అని చెప్పలేదు, ఆత్మ ఒక్కటి మాత్రమే నిజం అని చెప్పారు. నీవు నమ్మినది నిజం అవ్వదు. నీవు నమ్మినా, నమ్మకపోయినా ఆత్మ ఒక్కటే నిజం. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి నీవు sincereగా ప్రయత్నం చేస్తూ ఉంటే, dedicatedగా devotedగా నీకున్న సర్వశక్తులు సమర్పించి ప్రయత్నం చేస్తూ ఉంటే, అదే నా జీవిత ధ్యేయం అని ప్రయత్నం చేస్తూ ఉంటే, to be or not to be అనే లక్ష్యంతో నీవు ప్రయాణం చేస్తూ ఉంటే, గమ్యంను అందుకోవటంకోసం నీవు త్రికరణ శుద్ధిగా ప్రయత్నం చేస్తూ ఉంటే నీ హృదయంలో ఉన్న ఆత్మ నీ ప్రయత్నమును చూసి, నీ dedication,ను devotionను చూసి రూపం ధరించి వస్తుంది. వాడే గురువు. ఒక్క ప్రహ్లాదుడికోసమే లక్ష్మీ నరసింహ అవతారము వచ్చింది. అదేవిధంగా నీవు త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేస్తూ ఉంటే నీ హృదయంలో ఉన్న ఆత్మ అవసరమైతే నీకోసం రూపం ధరించి వస్తుంది. రూపం ధరించివచ్చి బాహ్యంగా విజృంభిస్తున్న నీ మనస్సును లోపలకు నెట్టుతుంది. లోపలకు త్రిప్పబడిన మనస్సును లోపల ఉన్న గురువు గుంజుకుంటాడు.

సాధన చేసేటప్పుడు ప్రారంభదశలో కొంత కష్టంగా ఉండవచ్చును. వాసనలు బలీయంగా ఉండవచ్చును. అప్పుడు సాధన కొంత కష్టంగా ఉంటుంది. మన అందరికి భగవంతుని తెలుసుకోవాలి అని ఉంది. అలాగే మనకు తెలియబడాలి అని భగవంతుడు కూడా అనుకోవాలి. అప్పుడు మాత్రమే ఆయన తెలియబడతాడు. పెళ్ళి జరిగేటప్పుడు తెరచాటునుండి పెళ్ళికూతుర్ని కొద్దికొద్దిగా చూస్తూ ఉంటారు. మీరు సాధన చేసేటప్పుడు తెరచాటునుండి పెళ్ళికూతురుకనబడినట్లుగా మీ హృదయంలో ఉన్న వస్తువు కొద్ది కొద్దిగా కనిపిస్తూ ఉంటుంది. బాగుంది కొద్దిగా తెలుస్తోంది అని మనకు అనిపిస్తుంది. మరల మరుగైపోతుంది. మీ మనస్సుకు ఆ వస్తువు కొద్దిగా తెలిసినప్పటికీ అది ఎన్నటికీ permanentకాదు. వాసనలు పూర్తిగా నాశనంఅయ్యే వరకు మీరు పొందే స్థితి permanentకాదు.

Money come and goes. Morality comes and grows. అని ఇంగ్లీషులో ఒక సామెత ఉంది. డబ్బు వస్తూ ఉంటుంది, పోతూ ఉంటుంది. కాని నైతిక విలువలు సంపాదిస్తే అవి పోవు పెరుగుతూ ఉంటాయి. వచ్చే జన్మకు కూడా వస్తాయి. నీకు నైతిక విలువలు ఉన్నాయి అనుకో స్మశానంలో శరీరం కాలిపోయినపుడు నైతిక విలువలు కాలవు. వచ్చే జన్మకు కూడా అవి వస్తాయి.

ఇంద్రియాలకు సంబంధించిన భోగాలు ఎదురుగా ఉండాలి. భోగాలు ఎదురుగా ఉన్నప్పటికీ ఇంద్రియాలకు వికారము రాకూడదు. అది సాధకుడి లక్షణము అని కాళిదాసు చెప్పాడు. నీవు ఎంత సాధన చేస్తున్నప్పటికీ ఒకో దేహములో నీ అభివృద్ధి ఆగిపోతూ ఉంటుంది. ఎంత సాధన చేసినా అభివృద్ధిలోనికి రాలేము. ఆధ్యాత్మికంగా

అభివృద్ధి పొందాలి అనే కాంక్ష, మోక్షమును పొందాలి అనే నీ తపనను భగవంతుడు చూస్తూ ఉంటాడు. ఈ దేహం మరణించిన తరువాత భగవంతుడు ఏమిచేస్తాడు అంటే ఎటువంటి కుటుంబములో నిన్ను ప్రవేశపెడితే నీకు బ్రహ్మానుభవం కలుగుతుందో అటువంటి కుటుంబములో నీకు జన్మను ఇస్తాడు. కొన్ని కుటుంబాలలో పుడితే జ్ఞానం సంపాదించటానికి వాలు గాలిలో సైకిలు త్రొక్కినట్లుగా ఉంటుంది. కొన్ని కుటుంబాలలో పుడితే నీకు జ్ఞానం సంపాదించాలనే కోరిక ఉన్నా ఎదురు గాలిలో సైకిలు త్రొక్కినట్లుగా ఉంటుంది. భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నీ సాధన నిజమైతే నీకు అనుకూలమైన కుటుంబమును select చేసి పెడతాను అంటున్నాడు.

మంచి స్నేహితులు మనకు ఎలా ఉపకారం చేస్తారో అలాగే మంచి మాట కూడా మనకు ఉపకారం చేస్తుంది. అయితే ఆ మాట మన హృదయానికి హత్తుకోవాలి. ఆ మాటను మీరు మర్చిపోవాలన్నా మర్చిపోవటానికి వీలులేకుండా ఆ మాట మిమ్ములను వెంటాడాలి.

మనకు చదువు ఉండవచ్చు, ధనం ఉండవచ్చు, గౌరవము ఉండవచ్చు. ఎన్ని ఉన్నప్పటికీ ఆత్మజ్ఞానము లేకపోతే శవమును అలంకరించినట్లుగా ఉంటుంది అని భగవాన్ చెప్పారు. ఆత్మవిద్యతో సంబంధము లేని భౌతికవిద్యలు మంటలో పెట్టిన కట్టెలు లాంటివి. మంటలో పెట్టి కట్టెలు బూడిద అవుతాయి. అలాగే ఆత్మవిద్యతో సంబంధములేని భౌతికవిద్యలు బూడిద అవుతాయి.

అహంకారము ఉంటే అంతాఉంది. అది లేకపోతే ఏదీలేదు అని భగవాన్ ఎక్కువగా చెపుతూ ఉండేవారు. అహంకారము ఉంటే నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, దేవుడు ఉన్నాడు, ప్రపంచం ఉంది, పుణ్యం ఉంది, పాపం ఉంది. ఈ అహంకారము ఎక్కడనుండి వస్తోంది అని వెతకటం ప్రారంభించు సకలము ఊడిపోతుంది అంటున్నారు భగవాన్. అంటే అన్నీ ఊడిపోతాయి.

దేహము మరణించిన తరువాత మనం ఉండము అనుకొంటున్నాము. అందువలన భయం కలుగుతోంది. ఎక్కడైతే భయం ఉందో అక్కడ దుఃఖము ఉంటుంది. ఎక్కడైతే attachment ఉందో అక్కడ దుఃఖము ఉంటుంది Attachmentలేని వాడికి పాపం చేయవలసిన పనిలేదు. ఎక్కడైతే attachment ఉందో వాడు పాపం చేసి తీరతాడు. Attachment లేనివాడు పాపం చేయలేడు. Attachment ఉన్నవాడు పాపం చేయకుండా ఉండలేడు. Attachment పేరుమీద ఎన్నో దోషాలు, పాపాలు ప్రోగుచేసుకొంటాము. అందువలన detached life lead చెయ్యాలి. Detached Life lead చేస్తూ ఉంటే attachmentకు దూరం అవుతాము. ఎవడైతే detached life lead చేస్తున్నాడో వాడు దోషములనుండి, పాపములనుండి, బలహీనతలనుండి విడుదల పొందుతాడు. ఎప్పుడైతే దోషములనుండి, బలహీనతలనుండి విడుదలపొందాడో ఉన్న వస్తువు ఉన్నట్లుగా వాడికి వ్యక్తమవుతుంది.

సందేహాలు ఉంటే మీరు జ్ఞానిని ఆశ్రయించి, నేర్చుకోవాలనే కాంక్షతో వినయంగా జ్ఞానిని అడిగి నివృత్తి చేసుకోమని భగవంతుడు చెపుతున్నాడు. అహంకారము నశించిన వెంటనే ఈ దేహమును దేవుడు స్వాధీనం చేసుకుంటాడు అంటే జ్ఞాని దేహమును భగవంతుడు స్వాధీనం చేసుకుంటాడు. వాడు మాట్లాడే ప్రతీమాట శాస్త్రమునకు సరిపోతుంది.

రమణమహర్షిగారు ఒకమాట చెప్పారు. మీరు కాలువలలో మునుగుతున్నారు. చలివేస్తుంది. కాశీ వెళ్లి గంగలో మునుగుతున్నారు. అక్కడా చలి ఉంటుంది. రాజమండ్రివెళ్లి గోదావరిలో మునుగుతున్నారు. అక్కడా చలి ఉంటుంది. మీ హృదయంలో మునగండి అక్కడ చలి ఏమీ ఉండదు. చలి వేయదు. సరికదా జ్ఞానం వస్తుంది. అక్కడ ఉన్నది జ్ఞానమే కాబట్టి జ్ఞానం వస్తుంది.